సాక్షి
పల్నాడు
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024




రూ.10 లక్షల వెండి వితరణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి దాచేపల్లికి చెందిన దేవరశెట్టి బాలాంజనేయులు కుటుంబ సభ్యులు రూ.10లక్షలు విలువ చేసే వెండిని కమిటీ సభ్యులు నరేష్‌కి అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3506 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 975 క్యూసెక్కులు వదిలారు.



44.59 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 61,071 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 44.59 టీఎంసీలు.

చాలా నష్టం



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలనే ఆలోచన, సీట్లు తగ్గించడంతో.. ఎన్నో ఆశలతో ఉన్న మేము నష్టపోయే అవకాశం ఉంది.

ఎంతో సమయం, నగదు ఖర్చు చేసి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. మంచి ర్యాంకు సాధించినా సీటు వస్తుందో, రాదోననే భయాందోళనలు చెందుతున్నాను. మాలాంటి వారికి వైద్యవిద్య కలగానే మిగిలిపోవాలా? న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

- ఎం.త్రివిక్రమరాజు, నీట్ విద్యార్థి, మచిలీపట్నం

నల్లబజారుకు రేషన్ బియ్యం

- కిలో రూ.10 చొప్పున కార్డుదారులకు చెల్లింపు
- మాఫియాకు విక్రయిస్తున్న రేషన్ డీలర్లు
- సరిహద్దులు దాటుతున్న బియ్యం
- జేబులు నింపుకుంటున్న నేతలు
- పేదలకు తప్పని ఆకలి బాధలు
- పట్టించుకోని అధికారులు

అధికార పార్టీ నేతల అండదండలు

ఆకలితో అలమటిస్తున్న పేదలకు పట్టెడన్నం పెట్టాలనే సదుద్దేశంతో ప్రభుత్వం రేషన్ బియ్యం పథకం అమలుచేస్తోంది. ఈ పథకం పేదవాడి ఆకలి తీర్చకున్నా అక్రమార్కుల జేబులు మాత్రం నింపుతోంది. అక్రమార్కులు నేరుగా రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. బియ్యం కోసం వెళ్లిన కార్డుదారుల చేతిలో పాతికో పరకో పెట్టి పంపిస్తున్నారు. దీంతో పేదలకు బియ్యం అందడం లేదు. చివరకు బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. పేదలకు ఆర్థిక భారం తప్పడం లేదు.



పౌరసరఫరాల కేంద్రంలో ఉన్న బియ్యం బస్తాలు(ఫైల్)

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మార్కెట్ యార్డు పౌరసరఫరాల కేంద్రం నుంచి పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల, కారంపూడి మండలాలకు రేషన్ బియ్యం సరఫరా చేస్తారు. ఐదు మండలాల పరిధిలో 97,726 రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు 205 రేషన్ దుకాణాల ద్వారా 1,371 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు.

అసలు దందా ఇలా...

పౌరసరఫరాల కేంద్రం నుంచి డీలర్లు బియ్యం రేషన్ షాపుకు తీసుకొని వస్తారు. అక్కడ నుంచి సరకులను పేదలకు పంపిణీ చేయాలి. కానీ డీలర్లు బియ్యానికి బదులు కిలోకి రూ.10 చొప్పున నగదు అందజేస్తున్నారు. కాదు బియ్యమే కావాలంటే మాత్రం పలు రకాల వంకలతో ఎగనామం పెడుతున్నారు. ఆ బియ్యాన్ని రేషన్ డీలర్లు రూ.18 చొప్పున మాఫియా వ్యక్తికి విక్రయిస్తాడు. అతను అన్ని మండలాల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఏకంగా కిలో రూ.25 చొప్పున కాకినాడ పోర్టు వద్దకు పంపిస్తారు. అక్కడ నుంచి చైనా, ఇతర దేశాలకు తరలిస్తారు.

పిడుగురాళ్ల కేంద్రంగా...

పిడుగురాళ్ల పట్టణమే అసలైన కేంద్రంగా రేషన్ మాఫియా చేస్తున్నారనే వాదనలు ఉన్నాయి. రేషన్ మాఫియా పిడుగురాళ్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో గోడౌన్‌లను ఏర్పాటు చేసినట్లు సమాచారం. దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల, కారంపూడి, బెల్లంకొండ, రాజుపాలెం మండలాల నుంచి సేకరించిన బియ్యం ఆయా గోడౌన్‌లలో నిల్వ చేస్తారు. అనంతరం ఓ రైస్ మిల్లులో పాలిష్ పడతారు. ఆ బియ్యాన్ని జిల్లా, రాష్ట్రం సరిహద్దులు దాటిస్తున్నారు. ఇదంతా గురజాల పట్టణానికి చెందిన అధికార పార్టీకి చెందిన నాయకుడు నడిపిస్తున్నాడనే వాదలు ఉన్నాయి.

మండలాలవారీగా రేషన్ సరఫరా ఇలా

పిడుగురాళ్ల పట్టణంలోని మార్కెట్ యార్డు పౌరసరఫరాల కేంద్రం నుంచి పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల, కారంపూడి మండలాలకు సరఫరా చేస్తారు.

మండలం	రేషన్ కార్డులు	టన్నులు
పిడుగురాళ్ల టౌన్	17985	250
పిడుగురాళ్ల మండలం	20239	287
మాచవరం మండలం	17481	238
దాచేపల్లి	24639	360
కారంపూడి	17382	236

నిద్రమత్తులో అధికార యంత్రాంగం

రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా బియ్యం తరలించేవారు. కానీ ప్రస్తుతం పట్టపగలే యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మాది అధికార పార్టీ అంటూ ఎదురు దాడులకు దిగుతున్నారు. ఇప్పటికైనా రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ వ్యాపారంపై దృష్టి

డివిజన్‌లో ఇప్పటి వరకు 85 శాతం మందికి రేషన్ అందించాం. ఈ నెల 17లోగా పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం లబ్ధిదారులకు డీలర్ల చేత అందిస్తాం. బియ్యం కొనుగోలు చేసుకొని ఎక్కువ ధరకు అమ్ముకునే వారిపై దృష్టి పెట్టడం జరిగింది. బియ్యం అక్రమంగా ఎవరైనా తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

- మురళీధర్, సివిల్ సప్లయిస్ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్



పిడుగురాళ్లలో పట్టపగలే వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడి హేయం

అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



కార్యకర్తను పరామర్శిస్తున్న చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తూ రెడ్ బుక్ పాలన చేస్తే.. త్వరలోనే తమ పార్టీ నాయకులు కూడా బ్లడ్ బుక్ పాలన చూపిస్తారని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి బాపట్ల జిల్లా అద్దంకి మండలం ధర్మవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి వంచన చేస్తున్నారన్నారు. ప్రజలు తిరగబడే రోజు దగ్గరలో ఉందని తెలిపారు. రెడ్ బుక్ పాలన అంటూ వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ వారు దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగబద్ధంగా పరిపాలన చేస్తే అందరూ హర్షిస్తారని తెలిపారు. ధర్మవరం గ్రామంలో వినాయక విగ్రహం నిమజ్జనోత్సవంలో వైఎస్సార్ సీపీ నాయకులను రెచ్చగొట్టేలా టీడీపీ నాయకులు బాణసంచా కాల్చారని గుర్తుచేశారు. ఇదేంటని అడిగిన వారిపై దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. నాయకులు అవిశెన ప్రభాకర్‌రెడ్డికి సంబంధించిన పెట్రోలు బంకు, రెండు లారీలు, టిప్పర్‌లను దహనం చేశారని మండిపడ్డారు. సుమారు రూ.2 కోట్ల వరకు ఆస్తిని నష్టపరిచారన్నారు. అధికార పార్టీకి పోలీసులు కొమ్ముకాయటం మంచిది కాదన్నారు. గాయాలపాలైన కార్యకర్తలను గుంటూరు వైద్యశాలకు తరలించారు. ధర్మవరంలో పరిస్థితులను నాయకులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న కార్యకర్తలను శనివారం పానెం చినహనిమిరెడ్డి పరామర్శించారు. అన్నివిధాలా వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన



నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 185 కేసులు పరిష్కారం కాగా రూ.6.80 కోట్లు కక్షిదారులకు పరిహారం కింద లభించిందని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.సత్యశ్రీ తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అదాలత్‌లో రాజీపడ దగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్, మోటార్ వాహన, మనోవర్తి, భాగపంపిణీ, జీవిత బీమా, ముందస్తు వ్యాజ్యాల కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ డి. మల్లారెడ్డి, అదాలత్ సభ్యులు కె.రాధిక, వై.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డికి సత్కారం



మాచర్ల: భారతదేశ అంధుల క్రికెట్ (బ్లైండ్) టీంకు కెప్టెన్‌గా వ్యవహరించి ఐదుసార్లు ప్రపంచ కప్ సాధించిన అజయ్‌కుమార్‌రెడ్డికి అత్యుత్తమ అర్జున అవార్డు అందించటం సంతోషకరమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్లకు వచ్చిన అజయ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించి శాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. యువత అజయ్ కుమార్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడలలో ముందుకెళ్లాలని కోరారు.

త్వరలో బీఎస్‌ఎన్‌ఎల్ వైఫై రోమింగ్ సేవలు

నెహ్రూనగర్: బీఎస్‌ఎన్‌ఎల్ గుంటూరు బిజినెస్ ఏరియా(గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు జిల్లాలు) పరిధిలో ఫైబర్ టూ ది హోం వినియోగదారులందరికీ వైఫై రోమింగ్ సేవ త్వరలో ప్రారంభించనున్నట్లు గుంటూరు జీఎం సప్పవరపు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఫై జోన్‌లలో రోమింగ్‌లో ఉన్నప్పుడు బీఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్లకు ఇంట్లో, ఈ జోన్‌లలో తిరిగి కనెక్ట్ చేసుకొనే అవసరం లేకుండానే నిరంతరాయంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సేవల్ని పొందేందుకు దగ్గరలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

దెబ్బతిన్న రైల్వే బ్రిడ్జి కింద రక్షణ గోడ



తాడేపల్లి రూరల్: కృష్ణా కెనాల్ జంక్షన్ నుంచి విజయవాడ రైల్వే జంక్షన్‌కు వెళ్లే మార్గంలో కృష్ణా నది మీదున్న రైల్వే బ్రిడ్జి కింద రక్షణ గోడ (రివెట్‌మెంటు) నీటి ప్రవాహానికి పూర్తిగా దెబ్బతింది. ఇటీవల నదికి 11.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. ప్రవాహానికి రెండు బ్రిడ్జిల గోడ కింద మట్టి నాని, రాళ్లు కిందకు జారాయి. రైల్వే అధికారులు వెంటనే స్పందించి వర్షాలు పడక ముందే బ్రిడ్జి కింద భాగాన్ని కాంక్రీట్‌తో నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో కోతకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

సహకార సంఘాలకు 'డిజిటల్' హంగులు

- పరపతి సంఘాల పూర్తి వివరాలు కంప్యూటరీకరణ
- పారదర్శకత, నాణ్యమైన సేవలే లక్ష్యం
- పైలెట్ ప్రాజెక్టుగా శావల్యాపురం, ఈపూరు
- 90 శాతం పనులు పూర్తి
- నెలాఖరులోగా పూర్తి చేసేందుకు చర్యలు



పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ పనులలో నిమగ్నమైన అధికారులు

బెల్లంకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు డిజిటల్ దిశగా అడుగులు వేస్తున్నాయి. సంఘాల పూర్తి వివరాలు, రికార్డులను కంప్యూటరీకరణ చేయాలన్న లక్ష్యంతో సంబంధిత శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పల్నాడు జిల్లాలోని శావల్యాపురం, ఈపూరు మండలాల్లోని పీఏసీఎస్‌లను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని 90 శాతం వరకు కంప్యూటరీకరణ పూర్తి చేశారు. మిగిలిన మండలాల్లో కూడా ఈనెలాఖరు కల్లా అన్ని సహకార సంఘాలను డిజిటలైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకుని వేగవంతంగా పనులు పూర్తయ్యేలా సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల సిబ్బందికి అవగాహన కల్పించి, డిజిటలైజేషన్ పనులు ప్రారంభించారు.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా....

జిల్లా వ్యాప్తంగా 60 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. వీటిలో 3,98,731మంది సభ్యులుగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సహకార సంఘాల కంప్యూటరీకరణ కార్యక్రమం వల్ల పీఏసీఎస్‌లలో పారదర్శకత జవాబుదారీతనం ఉంటుంది. సభ్యుల పూర్తి వివరాలు, సేవలను వేగవంతంగా, సమర్థవంతంగా పొందవచ్చు. దీంతో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేసేందుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.

పూర్తి వివరాల నమోదు

పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయడం ద్వారా సంఘంలోని ప్రతి సభ్యుని వివరాలు కంప్యూటర్లలో నమోదు చేస్తారు. దీనితో వ్యాపార లావాదేవీలు, సేవల వివరాలు పూర్తిస్థాయిలో నమోదవుతాయి. ఇప్పటికే పీఏసీఎస్‌లు డీసీసీ బ్యాంకు ద్వారా సేవలు అందిస్తుండగా, రానున్న రోజుల్లో ఇతర అన్ని బ్యాంకులతో కోర్ బ్యాంకింగ్ కార్యక్రమాలు చేపట్టే వీలుంటుంది. కంప్యూటరీకరణ చేసే ప్రక్రియపై రాష్ట్ర ఉన్నతాధికారులు గత నెలలో జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీసీఓలతో ఆన్‌లైన్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు.

నెలాఖరులోగా పూర్తి చేసేందుకు చర్యలు

జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని శావల్యాపురం, ఈపూరు మండలాల్లో 90 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 30వ తేదీలోపు అన్ని పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో ప్రతిరోజు అధికారులు, సిబ్బందితో పనుల వేగవంతంపై సమీక్షలు నిర్వహిస్తున్నారు.

నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

సహకార పరపతి సంఘాల పూర్తి వివరాలు కంప్యూటరీకరణ వల్ల మొత్తం సభ్యులు వివరాలు పూర్తిస్థాయిలో డిజిటల్‌గా మారుతుంది. సహకార చట్టాన్ని అనుసరించి సొంత భూమి కలిగిన వారు, కౌలు భూమిని సాగు చేస్తున్న వారు సభ్యులుగా అర్హత కలిగి ఉంటారు. వారి భూముల వివరాలు కూడా నమోదవుతాయి. దీనివల్ల నిధుల దుర్వినియోగం అడ్డుకట్టడంతో పాటుగా పారదర్శకత పెరుగుతుంది. అంతేకాకుండా కోర్ బ్యాంకింగ్‌కు పీఏసీఎస్‌లు అనుబంధంగా ఉండి ప్రతి పంచాయతీ, మండల కేంద్రాల్లో బ్యాంకు కార్యకలాపాలు కొనసాగిస్తాయి. సంఘ సభ్యులకు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందుతాయి.

ఈ నెలాఖరులో పూర్తి చేసేందుకు చర్యలు

జిల్లాలోని అన్ని సహకార పరపతి సంఘాలను ఈ నెలాఖరులోగా కంప్యూటరీకరణ చేసేందుకు పనులు ప్రారంభించాం. ఇప్పటికే శావల్యాపురం, ఈపూరు మండలాల పీఏసీఎస్‌లలో దాదాపుగా పనులు పూర్తయ్యాయి. జాయింట్ కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలోని అన్నీ చోట్లా పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు సిబ్బంది నిమగ్నమై ఉన్నారు పీఏసీఎస్‌ల సీఈవోలు, డీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్‌లు, మేనేజర్లు, సహకార సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తాం.

- వెంకటరమణ, జిల్లా సహకార శాఖాధికారి, పల్నాడు

పక్షపాతంపై ప్రశ్నిస్తే పరోక్షంగా పోలీసు కేసు

ముంపు గృహాల నమోదులో లోపాలపై నిలదీసిన బాధితుడు

కొల్లూరు: కృష్ణా నది వరదలకు ముంపునకు గురై నష్టపోయిన గృహాల నమోదు విషయంలో లోపాలను ప్రశ్నించడమే ఆ యువకుడి విషయంలో తప్పైపోయింది. దాడికి దిగారనే ఆరోపణతో టీడీపీ మద్దతుదారుడైన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఆ యువకుడిపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని తిప్పలకట్టకు చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన పెదపల్లి యశ్వంత్ విద్యాభ్యాసం పూర్తిచేసి నిరుద్యోగిగా గ్రామంలో జీవిస్తున్నారు. ఇటీవల వరదల కారణంగా ముంపునకు గురైన ఇళ్ల నమోదు విషయంలో సంబంధిత బృందాలు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తుండటంపై ప్రశ్నించారు. ముంపునకు గురైన అన్ని ఇళ్ల వివరాలు నమోదు చేయాలని బృంద సభ్యులను కోరారు. ఈ విషయం స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులకు కంటగింపుగా మారింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం యశ్వంత్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లి శనివారం రాత్రి వరకు అక్కడే ఉంచారు. అతడిపై కేసు నమోదు చేశారు. కేసు విషయమై కొల్లూరు ఎస్‌ఐ జి. ఏడుకొండలు మాట్లాడుతూ.. గృహ నష్ట నమోదు విషయంపై ఫిర్యాదు అందలేదన్నారు. తిప్పలకట్ట ఎస్సీ ప్రాంతానికి చెందిన రాంబాబుపై యశ్వంత్ గొడవకు వెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడికి నోటీసులు ఇచ్చి పంపనున్నట్లు తెలిపారు.

నినాదాలతో మార్మోగిన జీజీహెచ్ ప్రాంగణం



గుంటూరు మెడికల్: కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నినాదాలతో శనివారం గుంటూరు జీజీహెచ్ ప్రాంగణం మారుమోగింది. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. విధులు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలు ధరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు చేతబట్టుకుని న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. నిరసనలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడికి నిరసనగా ధర్నా

- ఫ్లెక్సీ చించారని ప్రశ్నించినందుకు ఇటీవల దాడి చేసిన టీడీపీ నేతలు
- నిందితులను అరెస్టు చేయాలని, కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్
- టీడీపీ నేతల అండతో ఎస్సీ కాలనీలోని 17 మందిపై కేసు నమోదు
- దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా



లగడపాడు అంబేద్కర్ బొమ్మ వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తున్న దళిత సంఘాలు, బాధిత కుటుంబాలు



అక్రమ కేసులు ఎలా పెట్టారని ఎస్సై బాలునాయక్‌ని ప్రశ్నిస్తున్న దళిత సంఘాలు నేతలు

పెదకూరపాడు: మాపైనే దాడి చేసి, మాపైనే కేసుల నమోదు ఎలా చేస్తారంటూ పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలోని వైఎస్సార్ సీపీ ఎస్సీ కార్యకర్తలు పోలీసులను ప్రశ్నించారు. శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి కృష్ణ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈనెల 9న లగడపాడు గ్రామంలో ఓసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు వినాయకుని విగ్రహం ఊరేగింపు సందర్భంగా ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను టీడీపీ నేతలు, కార్యకర్తలు చించివేశారు. ఈ విషయమై ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రశ్నించడంతో కాలనీకి చెందిన ఎర్రగొర్ల నరసింహారావు, వల్లం ఏసుపాదంలపై విచక్షణారహితంగా దాడి చేసి, ట్రాక్టర్‌తో తొక్కించి గాయపరిచారు. పెదకూరపాడు పోలీసుల సమక్షంలోనే దాడి జరుగుతున్నా పట్టించుకోలేదని బాధితులు ఆరోపించారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి కృష్ణ మాట్లాడుతూ అగ్రవర్ణాలకు చెందిన టీడీపీ నాయకులు పోలీసుల ఎదుటనే విచక్షణారహితంగా దళిత కులానికి చెందిన యువకులపై దాడి చేసి ట్రాక్టర్‌తో తొక్కించే ప్రయత్నం చేసినా పట్టించుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినా నిందితులను ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ప్రశ్నించారు. సంఘటన జరిగిన మూడు రోజుల తర్వాత అగ్రవర్ణాల నేతలు, టీడీపీ నాయకుల ఒత్తిడితో ఎస్సీ కాలనీకి చెందిన 17 మంది చదువుకున్న యువకులపై అక్రమ కేసులు నమోదు చేయటం దారుణమన్నారు. అధికార పార్టీ మాది అంటూ ఎస్సీలపై బెదిరింపులకు పాల్పడటం దమనకాండకు నిదర్శనం అన్నారు. ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం నేరమా అని ప్రశ్నించారు. గతంలో కూడా లగడపాడు గ్రామంలో దళితులపై అగ్రవర్ణాలు దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విచక్షణ రహితంగా దాడులు చేస్తున్నా పోలీసులు చోద్యం చూడటం విడ్డూరమన్నారు. టీడీపీ నేతల ఒత్తిడితోనే అమాయకులైన దళిత యువకులపై అక్రమ కేసులు బనాయించారని వెంటనే కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై దాడులకు పాల్పడిన రావెల మనేష్, మద్దూరు వెంకయ్య వారి అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడులు జరుగుతున్న సమయంలో ప్రత్యక్షంగా ఉండి దాడులు నివారించలేని పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు పోలీసు అధికారులు అండగా ఉండాలన్నారు. లేనిపక్షంలో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ల సేవలపై తప్పుడు ఆరోపణలు తగదు

గుంటూరు ఎడ్యుకేషన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించిన వలంటీర్లపై పంచాయతీ రాజ్ శాఖ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నేత రాజేంద్రప్రసాద్ తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఏపీ స్టేట్ యూనియన్ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆయన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కోవిడ్-19 సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు అందించిన సేవల్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లకు రూ.10వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీల్ని తుంగలో తొక్కారని మండిపడ్డారు. తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకుని, వేతనం పెంపుదలతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేటి నుంచి అమరావతి నాట్యోత్సవం

నగరంపాలెం: కె.ఆర్.కె.ఎం.మెమోరియల్ అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో అమరావతి నాట్యోత్సవం -2024 (భారతీయ నాట్యరీతుల సమ్మేళనం) నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కోకా విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సాయంత్రం ప్రారంభమవుతాయని చెప్పారు. కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్ర నాట్యం, కథక్, పేరిణి నాట్యం తదితర అనేక నృత్య ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. కళాభిమానులు హాజరుకావాలని ఆమె కోరారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: పదో తరగతి విద్యార్థిని భయపెట్టి అత్యాచారానికి పాల్పడి గర్భిణిని చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తారకరామానగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థినిని అదే ప్రాంతంలో నివాసం ఉండే కార్ల పెయింటర్ షేక్ కాలేషా అ భయపెట్టి తన ఇంటిలో పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే, కొద్దిరోజుల కిందట విద్యార్థిని కడుపు నొప్పి అంటూ ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు విద్యార్థిని మూడు నెలల గర్భం దాల్చి ఉందని తెలిపారు. విషయం ఆరా తీయడంతో కాలేషా తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు విద్యార్థిని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కోడెల విగ్రహావిష్కరణకు సన్నాహాలు

- అర్ధరాత్రి దిమ్మెను నిర్మించి విగ్రహం నిలబెట్టిన ఆయన వర్గీయులు
- ఎటువంటి అనుమతులు తమకు అందలేదంటున్న సూపరింటెండెంట్
- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు సైతం తెలియచేయకుండానే ఏర్పాట్లు



ప్రభుత్వ వైద్యశాలలో ఆవిష్కరణకు సిద్ధం చేసిన దివంగత మాజీ స్పీకర్ కోడెల విగ్రహం

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేటలో టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వ్యతిరేకంగా దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్గీయులు పావులు కదుపుతున్నారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా లింగంగుంట్లలోని 200 పడకల ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో డాక్టర్ కోడెల విగ్రహ ఆవిష్కరణకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం అర్ధరాత్రి మెయిన్‌రోడ్డు వైపున ఉన్న హాస్పిటల్ మెయిన్‌గేటుకు పక్కగా ప్రహరీని ఆనుకొని లోపలి వైపున అప్పటికప్పుడు దిమ్మెను నిర్మించి విగ్రహం కూడా నిలబెట్టారు. ఈనెల 16న కోడెల వర్ధంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించాలనే ప్రయత్నంలో కోడెల వర్గీయులు ఉన్నట్లు సమాచారం. దీనిపై హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్‌ను వివరణ కోరగా తన వద్దకు రవి అనే పేరు గల వ్యక్తితో పాటు మరికొంతమంది వ్యక్తులు వచ్చి హాస్పిటల్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ ఒక కాగితం ఇచ్చారని, అయితే హాస్పిటల్ ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు ఎటువంటి అనుమతులు తనకు రాలేదని చెప్పటంతో వారు వెళ్లిపోయారన్నారు. అదే రోజు అర్ధరాత్రి వచ్చి ఆఘమేఘాలపై దిమ్మెను నిర్మించి విగ్రహాన్ని నిలబెట్టారన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తోపాటు పై అధికారులు, స్థానిక ఎమ్మెల్యేకు తెలియచేశామన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఏవిధంగా విగ్రహాన్ని ఏర్పాటుచేస్తారని అంటూ ఉన్నది ఉన్నట్లుగా ఉండేవిధంగా చూడాలని తనను ఆదేశించారన్నారు. అనంతరం విగ్రహాన్ని ఆవిష్కరించకుండా చూడాలంటూ డీఎస్పీ, రూరల్ సీఐలను కలిసి కోరామని సూపరిండెంట్ తెలిపారు. కాగా, ఇదే హాస్పిటల్ పేరును ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రభుత్వ హాస్పిటల్‌గా మారుస్తూ ఆయన వర్గీయులు ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన విషయం విధితమే.

ప్రకాష్‌నగర్‌లో...

స్థానిక ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డులో ఎన్‌టీ. రామారావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రోడ్డు కూడలిలో దిమ్మెను ఏర్పాటు చేశారు. ఈనెల 16న కోడెల వర్ధంతి సందర్భంగా విగ్రహాలను ఆవిష్కరించనున్నారు.

గంజాయి అమ్మకం కేసులో ముగ్గురు అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- కిలోన్నర గంజాయి, నాలుగు బైక్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్: గంజాయి అమ్మకంతో తో పాటు బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిలోన్నర గంజాయి, నాలుగు బైక్‌లను స్వాధీన పర్చుకున్నారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాల్ని డీఎస్పీ బి. జనార్దనరావు తెలియజేశారు. పట్టణంలోని ఐతానగర్ కు చెందిన రావుత్ సల్మాన్ స్నేహితుడు ప్రభాస్‌తో కలసి అరకులో గంజాయి కొనుగోలు చేసి, తెనాలి తీసుకువచ్చి చిన్న పొట్లాలుగా చేసి అమ్ముతున్నారు. స్థానిక చినపరిమి వెళ్లే డొంకలో రావుత్ సల్మాన్ రజకపేటకు చెందిన మునిపల్లి సుబ్బారావు, మారిస్‌పేటకు చెందిన కోళ్ల మహేష్, మరో ఇద్దరు గంజాయితో ఉన్నారన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఇందులో రావుత్ సల్మాన్ మునిపల్లి సుబ్బారావు, కోళ్ల మహేష్ పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన ముగ్గురి నుంచి కిలోన్నర గంజాయితో పాటు చోరీ చేసిన నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్నా, కలిగి ఉన్నా కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కేసులో నిందితుల్ని అరెస్టు చేసిన సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ ఎన్. ప్రకాశరావు, సిబ్బంది పి. మురళి, డి. సురేష్, జి. నరేంద్ర, సీహెచ్. శ్రీరామమూర్తిలను ఆయన అభినందించారు.

మైనర్లపై అత్యాచారయత్నాలు

మంగళగిరి: నియోజకవర్గంలో 24 గంటల వ్యవధిలో ముగ్గురు మైనర్లను కామాంధులు చెరపట్టిన ఘటన చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

- మంగళగిరి పరిధిలోని రత్నాలచెరువులో గల బీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న మైనర్‌పై అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం బాలిక తల్లితండ్రులు పనికి వెళ్లగా ఒంటరిగా నిద్రపోతున్న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇంతలో నిద్ర లేచిన బాలిక బిగ్గరగా అరుస్తూ బయటకు పరిగెత్తి పక్కింటి వారికి విషయం చెప్పి విలపించింది. సమాచారం అందుకున్న బాలిక తల్లితండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.
- బాలాజీనగర్‌లో ఏడు సంవత్సరాల బాలికపై అదే ప్రాంతానికి చెందిన 60 సంవత్సరాల చింతకింది వెంకటేశ్వరరావు అత్యాచారానికి యత్నించాడు. ఈలోపు బాలిక తల్లితండ్రులు రావడంతో పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరరావుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్టు

ఆత్మకూరుకు చెందిన రూపేంద్ర ప్రభు పెదకాకానికి చెందిన గుడిపాటి నాగరాజు కుమార్తెను ప్రేమించాలని వేధిస్తున్నాడు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతడ్ని హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా ఇంట్లో ఎవరు లేని సమయంలో బాలికను ద్విచక్ర వాహనంపై బలవంతంగా ఎక్కించుకుని కిడ్నాప్‌కు యత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

18న ఫుట్‌బాల్, జూడో జిల్లా జట్ల ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ఫుట్‌బాల్, జూడో జట్టు ఎంపిక పోటీలను ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్టు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-17 బాలబాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలోనూ, జోడో అండర్-14, అండర్-17 బాలబాలికల జట్టు ఎంపిక పోటీలు చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, స్టడీ, బర్త్ సర్టిఫికెట్లను తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

తుళ్లూరులో నేటి నుంచి ఇసుక లోడింగ్

తాడికొండ: జిల్లాలోని తుళ్లూరు మండలం లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక స్టాక్ యార్డుల్లో ఆదివారం నుంచి ఇసుక లోడింగ్‌కు అనుమతి ఇస్తున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. లోడింగ్‌కు గత నెల 29 వరకు బుకింగ్ జరిగిందని పేర్కొన్నారు. అధిక వరదలతో తేదీల్లో మార్పులు చేసిన కారణంగా గతంలో లోడింగ్ చేసుకోకుండా ఉన్న లారీలకు ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు అనుమతి ఇచ్చినట్లు వివరించారు. ఆగస్టు 30న బుక్ చేసుకున్న వారికి సెప్టెంబరు 15, 16 తేదీల్లో, ఆగస్టు 31 బుక్ చేసుకున్న వారికి 17, 18 తేదీల్లో, సెప్టెంబరు 1న బుక్ చేసుకున్న వారికి 19, 20 తేదీల్లో, సెప్టెంబరు 2న వారికి 21, సెప్టెంబరు 3న బుక్ చేసుకున్న వారికి సెప్టెంబరు 22న, సెప్టెంబరు 4, 5న బుక్ చేసుకున్న వారికి 23 తేదీల్లో లోడింగ్ జరుగుతుందని ఆమె వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

19 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీల్ని నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మల్లంపూడి రవి పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో శుక్రవారం పోటీల నిర్వహణపై మండల, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ అంశాల్లో టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 24,25,26వ తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో పోటీల్ని నిర్వహించి, ఎంపికైన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపాలని వివరించారు.

కాల్వలో యువకుడి మృతదేహం లభ్యం

వేటపాలెం: స్ట్రయిట్ కట్ కాల్వలో యువకుడి మృతదేహం శనివారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. రామన్నపేట పంచాయతీ ఇందిరా కాలనీకి చెందిన లక్ష్మణాచారి (18) చీరాలలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ చీరాల వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో లక్ష్మణాచారి డ్రగ్స్‌కి బానిసయ్యాడు. ఒక్కోసారి రెండు మూడు రోజుల తరువాత ఇంటికి వస్తుండేవాడు. ఈ నెల 4వ తేదీన చీరాల వెళ్లి తిరిగి రాలేదు. 6వ తేదీన అతడి మోటార్ బైక్ బైపాస్ రోడ్డు దగ్గరలో రోడ్డు పక్కన ఉండటాన్ని స్నేహితులు గుర్తించారు. బైకును ఇంటికి తెచ్చి ఇచ్చారు. యువకుడి తండ్రి రాఘవాచారి అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం యువకుడు బైక్ వదిలి వచ్చిన ప్రాంతంలో స్ట్రయిట్ కట్ కాల్వ వద్ద నీటిలో కొడుకు మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని చీరాల రూరల్ సీఐ ఎస్.సత్యనారాయణ, ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు పరిశీలించారు. మృతదేహాన్ని కాల్వ నీటి నుంచి బయటికి తీయించారు. అతడు కాలవలో పడి దాదాపు పది రోజులై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు అనుమానిత మృతి కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ అస్తవ్యస్తం



మాట్లాడుతున్న ఎస్టీయూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి శ్రీనివాసరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సమావేశం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియలో జరిగిన లోపాలను సరిచేయాల్సి ఉందని కోరారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలకు విద్యార్థులు లేని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సర్దుబాటు వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జరిగే ప్రక్రియను జఠిలం చేసి గందరగోళం చేశారని విమర్శించారు. సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రక్రియ కారణంగా కొంతమంది ఉపాధ్యాయులు రిలీవ్ కాలేని పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. ఇప్పటికైనా లోపాలను సరిచేసి విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. పల్నాడు జిల్లాలో జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ ఉపాధ్యాయుల వారీగా సర్దుబాటు చేయలేదన్నారు. జెడ్పీ ఉపాధ్యాయులతో మున్సిపల్ పాఠశాలలు భర్తీ చేయడం జరిగిందన్నారు. ఇది మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల ప్రమోషన్లపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. మెరిట్ కమ్ రోస్టర్ సీనియారిటీ జాబితా రూపొందించి ఆ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులను కాదని జెడ్పీ ఉపాధ్యాయులతో సర్దుబాటు చేయడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, షేక్ జమీర్‌బాష, షేక్ ఫరిసా, ఐ అంకమ్మరావు, ఎస్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

నల్లమలలో విత్తన బంతులు చల్లిన డీఎఫ్ఓ రామచంద్రరావు, పర్యావరణవేత్త జాజి



విత్తన బంతులతో డీఎఫ్ఓ రామచంద్రరావు, పర్యావరణవేత్త జాజి, విద్యార్థులు

కారెంపూడి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత కావాలని జిల్లా అటవీశాఖాధికారి ఎన్ రామచంద్రరావు పిలుపునిచ్చారు. కారెంపూడి సమీపంలోని కాకిరాల రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి)తోపాటు ఫారెస్ట్ అధికారులు దివ్యసాయి స్కూలు విద్యార్థులతో కలసి శనివారం విత్తన బంతులను చల్లారు. కోటి విత్తన బంతులు చల్లాలని లక్ష్యంగా పెట్టుకుని విద్యార్థుల సహకారంతో జాజి విత్తన బంతులు తయారు చేసి వాటిని అడవిలో చల్లుతున్నారన్నారు. గతంలో చల్లిన విత్తన బంతుల ద్వారా వచ్చిన మొక్కలను డీఎఫ్ఓ సంతోషంగా పరిశీలించారు. విత్తన బంతుల్లో మొలక శాతం ఎంత ఉంటుందని పర్యావరణవేత్త జాజిని అడిగి తెలుసుకున్నారు. జాజి చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఇప్పటికే విత్తన బంతులంటే ఏమిటో తెలుసుకున్నారని మనం వినియోగించుకున్న పండ్లలోని విత్తనాలను సేకరించిన ఇతర విత్తనాలతో విత్తన బంతులు తయారు చేసి పాఠశాలల ఆవరణ ఇతర సామాజిక స్థలాలలో వేసినట్లయితే అవి చెట్లుగా ఎదుగుతాయని ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనట్లయితే హరితాంధ్రప్రదేశ్ కలను సాకారం చేసుకోవచ్చన్నారు. జాజి విత్తన బంతులు అందించగా డీఎఫ్ఓ విద్యార్థులతో కలసి అడవిలో వాటిని చల్లారు. విద్యార్థుల సమావేశంలో డీఎఫ్ఓ మాట్లాడుతూ అడవులతో ముడిపడిఉన్న పర్యావరణ పరిస్థితులను అడవుల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. అడవులను సంరక్షించుకోవడంతో పాటు అడవుల్లో ఉండే వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. మానవ మనుగడకు ప్రతి మొక్క విలువైనదని చెట్ల నరికివేతను అరికట్టడానికి చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ రేంజ్ అధికారి సి మాధవరావు, కారెంపూడి బీట్ అధికారి షేక్ అమీర్ జానీబాషా, బొల్లాపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి వై సూర్యనారాయణ, మేళ్ల వాగు బీట్ అధికారి వై భాస్కర్, రావులాపురం బీట్ అధికారి కె నాగార్జున, రేమిడిచర్ల బీట్ అధికారి ఎస్ గణేష్ పాల్గొన్నారు.

జయములివ్వు బొజ్జ గణేశా

8వ రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



సత్తెనపల్లిలో పూజలందుకున్న 61 అడుగులు మట్టి వినాయకుడు

సత్తెనపల్లి: వినాయక నవరాత్రుల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జుననగర్‌లో గల శ్రీశ్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో వినాయక నవరాత్రులు వైభవంగా జరుగు తున్నాయి. దీనిలో భాగంగా 8వ రోజు శనివారం 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీ సత్య సాయి యువజన సంఘం అధ్యక్షుడు సాయితేజ రాజు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొమ్మిదో రోజు ఆదివారం నిమజ్జనం చేయనున్నారు.

స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శిగా నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు గుంటూరు నరసింహారావు నియమితులయ్యారు. జిల్లా వృత్తి విద్యాధికారి జె.పద్మ అధ్యక్షతన ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశంలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు నరసింహారావు శనివారం తెలిపారు. సహాయ కార్యదర్శిగా తెనాలిలోని అంబేడ్కర్ జూనియర్ కళాశాల పీడీ సీహెచ్ పద్మాకర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.